క్లుప్తంగా

ప్రమాదకరంగా బోరుబావి



మూతలేని బోరుబావి

కొత్తూరు: మూతలు లేని బోరుబావుల్లో చిన్నారులు పడి మృత్యువాతపడుతున్న ఘటనలు ఆయా ప్రాంతాల్లో తరచూ చోటు చేసుకుంటున్నాయి. అయినప్పటికీ మండలంలో ప్రమాదకరంగా మారిన బోరుబావులను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మండల పరిధిలోని సిద్ధాపూర్ గ్రామంలో గల వైకుంఠధామం ఆవరణలో గతంలో బోరు వేశారు. అనంతరం దానికి మోటార్ బిగించకుండా బోరుబావి పైపు పైభాగంలో రాయిని మూతగా పెట్టారు. రాయి తొలిగిపోతే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకముందే అధికారులు స్పందించి బోరుబావికి మూత ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని వీరన్నపేట సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న సందర్భంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ రవికుమార్ తెలిపారు. మండలంలోని పద్మారం, వీరన్నపేట, పెద్దఎల్కిచర్ల, గాలిగూడ, జిల్లేడ్, జాకారం, చేగిరెడ్డి ఘనాపూర్, చెన్నారెడ్డిగూడ గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆయన పేర్కొన్నారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉపాధిలో రైతులకు ప్రాధాన్యత

ఎంపీడీఓ ప్రవీన్‌కుమార్



వనంపల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రవీన్‌కుమార్

కొందుర్గు: మండలంలోని అన్ని గ్రామాల్లో 2025–26 సంవత్సరంలో ఉపాధిహామీ పథకంలో చేపట్టబోయే పనుల ప్రణాళికను సిద్ధం చేయాలని జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీఓ ప్రవీన్‌కుమార్ సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో పాటు ఉపాధి సిబ్బందితో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రణాళికలో రైతులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ హన్మంత్‌రెడ్డి, డీటీ భాస్కర్, ఏఈ వంశీకృష్ణ, శ్రీకాంత్, ఏఓ రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు. అంతకు ముందు వనంపల్లిలో వననర్సరీని పరిశీలించి, మొక్కలు ఏపుగా పెరిగేలా చూడాలని నర్సరీ సిబ్బందికి సూచించారు.

పీఆర్టీయూ, ఎస్టీయూ కేలండర్ల ఆవిష్కరణ

చేవెళ్ల: విద్యాభివృద్ధికి కృషి చేస్తూ విద్యార్థులను ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని మండల విద్యాధికారి పురందాస్, పీఏసీఎస్ చైర్మన్ డి.వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఆగిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రం వద్ద గురువారం వేర్వేరుగా పీఆర్టీయూ, ఎస్టీయూ సంఘాలకు చెందిన కేలండర్, డైరీలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సామల మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.కృష్ణారెడ్డి, ఎస్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు హరి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్, కృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు టేకుపల్లి శ్రీను, ఎం.శ్రీనివాస్, ఉపాధ్యా సంఘం నాయకులు ఖాజాపాషా, దయానంద్, రాజశేఖర్, నర్సింహారెడ్డి, జనార్దన్‌రెడ్డి, కృష్ణ, ప్రకాశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సమాఖ్య అభివృద్ధికి కృషిచేయాలి

ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి

కేశంపేట: మహిళా సమాఖ్య అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మండల మహిళా సమాఖ్య భవనంలో గురువారం గ్రామ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, వీఓఏలకు నూతన బైలాపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ మాట్లాడుతూ.. నూతన బైలా ప్రకారం గ్రామస్థాయిలో ఉన్న అన్ని మహిళా సంఘాలు, గ్రామ, మండల సంఘాల అధ్యక్ష, కార్యదర్శులను నూతనంగా ఎంపిక చేసుకోవాలని సూచించారు. మార్చిలోగా అన్ని గ్రామాలతో పాటు మండల నూతన కమిటీలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. మహిళా సమాఖ్య అభివృద్ధికి అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం భగవంతు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆలయం ముస్తాబు

- 11 నుంచి నాలుగు రోజులపాటు జరగనున్న ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



ముస్తాబైన మల్లికార్జునస్వామి దేవాలయం

మొయినాబాద్: చిలుకూరు శ్రీ భ్రమరాంభ మల్లికార్జునస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈ నెల 11 నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు సంగెరి మల్లేశ్, ప్రధాన కార్యదర్శి గున్నాల గోపాల్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న మల్లికార్జునస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రతి సంవత్సరం సంక్రాంతికి ముందు నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. ఉత్సవాలకు గాను ఆలయానికి రంగులు వేసి ముస్తాబు చేశారు. స్వామివారి దర్శనానికివచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

రోజువారీ కార్యక్రమాలు ఇలా..

11 వ తేదీ శనివారం రాత్రి గంగస్నానంతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తారు. 12వ తేదీన ఆదివారం ఉదయం 9 గంటలకు ధ్వజారోహణం, అభిషేకం, 10 గంటలకు ఎల్లమ్మ లగ్నము, మధ్యాహ్నం 1 గంటకు ఎల్లమ్మ బోనాలు, 1.30 గంటలకు భ్రమరాంభ మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం, సాయంత్రం 4 గంటలకు బోనాల ఊరేగింపు, 5 గంటలకు శివసత్తులు అగ్నిగుండాలు తొక్కుట, 5.30 గంటలకు ఒగ్గువారు ఉక్కు గొలుసు తెంపుట, రాత్రి 8 గంటలకు ఒగ్గుకథ కార్యక్రమాలు ఉంటాయి. 13వ తేదీ సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు సదరు పటం తొక్కుట, సాయంత్రం 5 గంటలకు చిలుకూరు గ్రామంలో స్వామివారి ఊరేగింపు, 14న మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు నల్లపోచమ్మ బోనాల ఊరేగింపు నిర్వహిస్తారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.



ఎమ్మెల్యేకు మొక్క అందజేస్తున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: బ్రాహ్మణుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా గౌరవరాజుల వెంకటేశ్వర్‌రావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సంఘం నాయకులు గురువారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన గౌరవరాజుల వెంకటేశ్వర్‌రావును ఎమ్మెల్యే సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. నియోజకవర్గంలో బ్రాహ్మణులకు అవసరమైన స్థలం, భవన నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానన్నారు. అందరూ ఏకతాటిపైకి వచ్చి పండుగలు జరుపుకునే తేదీ విషయాల్లో తగిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షుడు రవిశర్మ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కుల అందజేత

జిల్లేడు చౌదరిగూడ మండలానికి చెందిన 63 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అందజేశారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.

ఐక్యంగా సమస్యలను పరిష్కరించుకుందాం

పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి



కేలండర్, డైరీ ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, నాయకులు

మొయినాబాద్‌రూరల్: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించుకునేందుకు అందరూ ఐక్యంగా ఉండాలని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కష్టారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని కనకమామిడి జిల్లా పరిషత్ పాఠశాలలో పీఆర్టీయూటీఎస్ మండల అధ్యక్షుడు బందయ్య, ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పీఆర్టీయూ టీఎస్ కేలండర్, డైరీ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహేందర్‌రెడ్డి, కష్టారెడ్డితో పాటు మండల విద్యాధికారి వెంకటయ్య పాల్గొని ఆవిష్కరించారు. అనంతరం వారు కనకమామిడి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. త్వరలో జరగబోయే రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల్లో పీఆర్టీయూ అభ్యర్థులను గెలిపించుకునే విధంగా కృషి చేసే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, సత్యనారాయణరెడ్డి, నరేందర్, కుమార్, శేఖర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, వేణు, రాములు, బీమ్లానాయక్, వెంకట్‌రెడ్డి, మల్లారెడ్డి, జంగయ్య, వినోద్, శ్రీనివాసులు, రాములునాయక్, రఘురాములు, కవితరాణి, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

- సీఐ వెంకటేశం



చేవెళ్ల: అనెక్స్ గ్లాస్ కంపెనీ వద్ద వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటేశం

చేవెళ్ల: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్‌రూల్స్‌ను పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని ట్రాఫిక్ సీఐ వెంకటేశం అన్నారు. మండల కేంద్రంలోని శంకర్‌పల్లి చౌరస్తాలో, అనెక్స్ గ్లాస్ కంపెనీ వద్ద గురువారం ట్రాఫిక్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ట్రాఫిక్ నిబంధనలపై ఆటో డ్రైవర్లు, వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్ చేయొద్దని, మద్యం సేవించి వాహనాలు నడపొద్దని తెలిపారు. లైసెన్స్ లేకుండా, మైనర్లు వాహనాలు నడిపిస్తే చర్యలు తీసుకుంటామని,జరిమాన విధించబడుతుందని తెలిపారు.కార్యక్రమంలో ట్రాఫిక్ ఏఎస్ఐ చందర్‌నాయక్, సిబ్బంది, వాహనదారులు ఉన్నారు.

బస్సు డ్రైవర్లకు అవగాహన

శంకర్‌పల్లి: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ సీఐ వెంకటేశ్ అన్నారు. గురువారం మండలంలోని దొంతాన్‌పల్లిలో గల ఇక్ఫాయ్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో బస్సు డ్రైవర్లు, సిబ్బందికి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైవర్లు మద్యం తాగిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపొద్దని, అలాంటి వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. అదేవిధంగా బస్సులను రోడ్లపైకి తీసుకొచ్చే క్రమంలో బస్సుకు సంబంధించిన పత్రాలను వెంట తీసుకురావాలని, పోలీసులు తనిఖీ చేసినప్పుడు సహకరించాలని కోరారు. డ్రైవర్లు అస్వస్థతకు గురైతే డ్రైవింగ్‌కి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఛాన్స్‌లర్ డా.ఎల్ఎస్ గణేశ్, రిజిస్ట్రార్ విజయ తదితరులు పాల్గొని, అవగాహన కల్పించిన ట్రాఫిక్ పోలీసులకు ధన్యవాదాలు తెలియజేశారు.

ఎంపీపై వివాదాస్పద వ్యాఖ్యలు సరికాదు

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేశ్



ర్యాలీగా వెళ్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

కేశంపేట: ఎంపీ ప్రియాంకగాంధీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్ అన్నారు. ఎంపీపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వీరేశ్ మాట్లాడుతూ.. బీజేపీ మాజీ ఎంపీ రమేశ్ బిదూరి ఎంపీ ప్రియాంకగాంధీని వివాదాస్పదంగా వ్యాఖ్యానించారన్నారు. మాజీ ఎంపీ రమేశ్ బిదూరిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలన్నారు. ఎంపీ ప్రియాంకగాంధీకి ఆయన బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే బీజేపీ నాయకులకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. బీజేపీ నాయకులకు మహిళలు అంటే గౌరవం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో మహిళల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామన్నారు. అనంతరం ర్యాలీగా వెళ్లి మాజీ ఎంపీపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్, ఏఎంసీ డైరెక్టర్ భాస్కర్‌గౌడ్, గిరియాదవ్, కరుణాకర్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, శ్రీశైలం, సురేష్, కిషన్, పెంటయ్య, పర్వతాలు, భీమయ్య, మనోహర్ పాల్గొన్నారు.

గ్రామాలను జీపీలుగానే కొనసాగించాలి




మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

- మంత్రి, ఎంపీకి ఆయా గ్రామ నాయకుల వినతి

మొయినాబాద్: మొయినాబాద్ మున్సిపాలిటీ ఏర్పాటు విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలని స్థానిక నాయకులు మున్సిపల్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబుకు విన్నవించారు. మండలంలోని ఎనిమిది గ్రామ పంచాయతీలకు చెందిన నాయకులు గురువారం నగరంలో మంత్రి శ్రీధర్‌బాబును, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డిని కలిసి వినతిపత్రాలు అందజేశారు. పూర్తిగా గ్రామీణ ప్రాంతంగా ఉన్న మొయినాబాద్ మండలంలోని ఎనిమిది గ్రామాలను మున్సిపాలిటీగా చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని పేర్కొన్నారు. మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తే స్థానిక ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందని మంత్రికి వివరించారు. 111 జీఓ అమలులో ఉన్న ఈ ప్రాంతంలో మున్సిపాలిటీ ఏర్పాటు చేయడంతో ప్రజలకు ఎలాంటి ఉపయోగం ఉండదన్నారు. మున్సిపాలిటీగా ప్రతిపాదించిన అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, చిలుకూరు, పెద్దమంగళారం, మొయినాబాద్, సురంగల్, ముర్తుజగూడ, ఎన్కెపల్లి గ్రామాలను గ్రామ పంచాయతీలుగానే కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాటి జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు గరుగు రాజు, అశోక్‌యాదవ్, జకరయ్య, ప్రవీణ్ ఉన్నారు.

బీఆర్ఎస్‌పై ఆరోపణలు మానుకోవాలి



మాట్లాడుతున్న నాయకులు

చేవెళ్ల: తెలంగాణ రాష్ట్ర సాధకుడు, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి పనులకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభోత్సవాలు చేస్తూ బీఆర్ఎస్‌పై ఆరోపణలు చేయటం సరికాదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పి.ప్రభాకర్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వంగ శ్రీధర్‌రెడ్డి అన్నారు. చేవెళ్లలో గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్‌పై ఆరోపణలు చేయడమే పనిగా పెట్టుకున్నారన్నారు. మండలంలో నిన్న మంత్రి, స్పీకర్ శంకుస్థాపన చేసిన ముడిమ్యాల నుంచి మేడిపల్లి వరకు బీటీరోడ్డు పనులు పాత జీవోతేనే జరుగుతున్నాయని చెప్పారు. ఇప్పుడు ఈ ప్రభుత్వం కొత్తగా ఇస్తున్నట్లు చెప్పటం సరైనది కాదన్నారు. షాబాద్‌లో పరిశ్రమల ఏర్పాటు, శంకర్‌పల్లిలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు గత ప్రభుత్వం చర్యలు తీసుకున్న విషయం మరిచిపోవద్దన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కేసీఆర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలు, గత ప్రభుత్వంపై వేస్తున్న నిందలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పీకర్ హోదాలో ఉన్న వ్యక్తి ప్రతిపక్ష పార్టీ నాయకులను కించపరిచే విధంగా మాట్లాడటం సరికాదన్నారు. ఎవరైనా, ఏ పార్టీ అయినా బీఆర్ఎస్ పార్టీని విమర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు నారాయణ, నర్సింలు, ఎల్లయ్య, రాంచంద్రయ్య, విఘ్నేశ్, ప్రభాకర్‌రెడ్డి, కృష్ణ తదితరులు ఉన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబురాలు



ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

షాద్‌నగర్‌రూరల్: పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న సాంఘీక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ నీతా ఆధ్వర్యంలో గురువారం సంక్రాంతి సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు రంగు రంగుల రంగవల్లులను తీర్చిదిద్దారు. విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులను ధరించి ప్రత్యేక వస్త్రాధారణలో ఆకర్షణగా నిలిచారు. విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో అలరించాయి. ప్రిన్సిపల్ నీతా మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగకు మహిళలు తీర్చిదిద్దే రంగవల్లులు హరివిల్లులను తలపిస్తాయన్నారు. మన పండుగలు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలన్నారు. పండుగల విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూత



విద్యార్థినులకు దుప్పట్లు అందజేస్తున్న ఆర్డీఓ చంద్రకళ, తహసీల్దార్ కృష్ణయ్య

చేవెళ్ల: పేద విద్యార్థులకు చేయూతనందించేందుకు మానవత్వంతో దాతలు ముందుకు రావటం అభినందనీయమని ఆర్డీఓ చంద్రకళ అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో గురువారం గొల్లపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు విఘ్నేశ్‌గౌడ్ 230 మంది విద్యార్థినులకు దుప్పట్లను ఆర్డీఓ చంద్రకళ, తహసీల్దార్ కృష్ణయ్య చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 10వ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు దాత విఘ్నేశ్‌గౌడ్ 10 వేల రూపాయలు ఇస్తానని ప్రకటించటం సంతోషకరమన్నారు. ప్రతి ఒక్కరు ఏదో రకంగా తమ వంత సహాయ సహకారాలను అందించాలని సూచించారు. ఈ సందర్భంగా దాత విఘ్నేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి శ్వేతారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి చర్యలు

- గెజిటెడ్ హెడ్‌మాస్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిధర్



సమావేశంలో మాట్లాడుతున్న గిరిధర్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని గెజిటెడ్ హెడ్‌మాస్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిధర్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎమ్మార్సీ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన వసతులను కల్పించడంతో పాటుగా నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సరైన వసతులు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో 2015 నుంచి సర్వీసు రూల్స్‌ను అమలు చేయకపోవడంతో ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోయారని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో జూనియర్ లెక్చరర్లు, ఎంఈఓలు, జీహెచ్ఎంలకు పదోన్నతులు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పదోన్నతులు ఇచ్చిందన్నారు. మధ్యాహ్న భోజన పథకం బాధ్యతలను హెచ్ఎంల నుంచి తప్పించి ఏజెన్సీలకు ఇవ్వాలని కోరారు. మధ్యాహ్న భోజనంలో ఏ చిన్న పొరపాటు జరిగినా హెచ్ఎంలను బాధ్యులను చేస్తూ వారిపై చర్యలు తీసుకోవడం సరికాదన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రభుత్వం ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. ప్రభుత్వం ప్రీ ప్రైమరీ పాఠశాలలను కూడా ఏర్పాటు చేయాలని, విద్యార్థులను కావాల్సిన మరిన్ని సదుపాయాలు కల్పించాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శంకర్‌రాథోడ్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు మనోహర్, యూటీఎఫ్ నాయకుడు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

- బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్

షాద్‌నగర్‌రూరల్: హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ కార్యాలయంపై, నాయకులపై దాడి చేసిన కాంగ్రెస్ నాయకులను కఠినంగా శిక్షించాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎంకనోళ్ల వెంకటేశ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకుల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న ఎస్సీ మోర్చా నాయకుడు నందరాజ్‌ను గురువారం వెంకటేశ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలు పరస్పరం విమర్శలు చేసుకోవాలే తప్పా దాడులకు పాల్పడటం సరికాదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన కాంగ్రెస్ నాయకులు, ప్రజల పక్షాన అడిగిన వారిపై దాడులు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక శాంతి భద్రతలను కాపాడటంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. బీజేపీ క్రమశిక్షణ కలిగిన పార్టీ అని, దాడులు చేయాలనుకుంటే కాంగ్రెస్ పార్టీ నాయకులు బయట తిరగరన్నారు. ఇప్పటికైనా దాడులు మానుకొని ప్రజల హామీలను అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేయాలని సూచించారు. పరామర్శించిన వారిలో బోసుపల్లి ప్రతాప్, విఠ్యాల నర్సింలు ఉన్నారు.

కల్యాణ వైభోగమే..

- రెండోరోజు కొనసాగిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు
- స్వామివారి కల్యాణోత్సవానికి భారీగా హాజరైన భక్తులు



కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

మొయినాబాద్‌రూరల్: ముత్యాల పందిరి, పచ్చని మామిడి తోరణాల అలంకరణతో శ్రీ దేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. గురువారం మండల పరిధిలోని కనకమామిడి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు, అర్చకుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారి కల్యాణం జరిపించగా.. ఆలయ చైర్మన్ కొండా లక్ష్మికాంత్‌రెడ్డి తలంబ్రాలు, పూలు సమర్పించారు. ఈ కల్యాణ మహోత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు స్వామివారి దర్శనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. దీంతో దేవాలయం భక్తులతో కిటకిటలాడింది.

నేడు వైకుంఠ ద్వార దర్శనం..

వేంకటేశ్వరస్వామి ఉత్తర దర్శనాన్ని శుక్రవారం ఉదయం 5 గంటలకు ప్రారంభిస్తామని ఆలయ చైర్మన్ కొండా లక్ష్మికాంత్‌రెడ్డి, ప్రధాన అర్చకుడు పరంకుశ నరేంద్రచార్యులు తెలిపారు. భక్తులు క్యూలో ఉండి స్వామివారిని దర్శించుకోవాలని, భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని వారు పేర్కొన్నారు.